

# వదలని విబవట

శివం

''ఏంవాయి పంతులూ, బాగున్నావా?'' అన్న పలకరింపుతో ఆశ్యర్యంగా తలెత్తి చూసేను. విశ్వనాథం కళ్ళజోడులో నుంచి చూస్తూ, నవ్వుతూ కూర్చుని వున్నాడు ఆ ఆఫీసులో వక కుర్చీలో.

''ఇదేమిటి? ఇక్కడున్నావేమిటి నువ్వు?'' అడిగేను.

''మరెక్కడ వుండమంటావు? గవర్నమెంటు నౌకరీ ఆ మజాకా? ఎక్కడికు ట్రాన్స్‌ఫర్ చేస్తే అక్కడకు వెళ్ళాల్సిందే! రా. అట్లాకూర్చో. ఏమిటి ఇటువైపు వచ్చేవు:''అంటూనే ఎదురుగా వున్న కుర్చీని చూపించేడు.

కుర్చీలో కూర్చుంటూనే ''అయితే ఎన్నాళ్ళ య్యింది యీవూరికి ట్రాన్స్‌ఫర్ అయి? పిల్లా, పాపా బాగున్నారా?'' అన్నాను వెనకటి రోజులు మనస్సులో మెదుల్తూ వుండగా.

''ఆ! ఎంత? రెండేళ్ళయ్యింది యిక్కడ కొచ్చి. నీ దయవల్ల అంతా కులాసాయే. అన్నట్టు విశేషం ఏమిటి?''అన్నాడు కుర్చీలోంచి కొంచెం ముందుకు వంగి.

ఆందోళనతో వాడి వున్న మనస్సుకి ఏదో ఆశాకిరణం కన్పించగా, వచ్చిన విషయం చెప్పేను.

''ఓస్,యింతేకదా. ఇట్లాంటివి మామూలే, దానికి పెద్దగా మనస్సు పాడుచేసుకోవద్దు. ఓ అప్లికేషన్ రాసి నా చేతికియ్యి. తర్వాత వ్యవహారం అంతా నేను చూసుకుంటాను. '' అన్నాడు భరోసాగా.

అప్లికేషన్ రాసి పట్టుకుని రావడం వల్ల, దానిని అతని చేతిలో పెట్టేను. అతను దానినో సారి చదివి,''ఓ చాలు. నువ్వు మరేం ఆలోచించకు.వీలుంటే ఓ వారం తర్వాత యిటు రా.




లేకపోతే నేనే నీకు పోస్టులో పర్మిట్‌ను పంపించే ఏర్పాటు చేస్తాను. "అన్నాడు విశ్వనాథం చిరునవ్వుతో.

"థాంక్యూ వేరీమచ్. మళ్ళీ పోస్టులో ఎందుకు? వారం తర్వాత నేనే వస్తాను యిటోసారి. ఆ...అన్నట్లు నీరచనా వ్యాసంగం ఎట్లా వుంది? ఈ మధ్య ఏమీ కన్పించడం లేదే?" అన్నాను. ఏదో వకటి మాట్లాడాలని.

"ఆ...ఇంకా ఏంరాస్తాం? రాసింది చాలు. రాసిన దానికి ప్రభుత్వం వాళ్ళు కూడా ఏదో బహుమతి పడేసేసేరు.పాత పుస్తకాల్లు రీప్రింటు అవుతున్నాయి. వాటికి రాయల్టీస్ ఎవ్వో బాగానే వస్తూనే వున్నాయి. అవును. నువ్వు ఎందుకు మానేసేవు? ఇది వరకంటే వుద్యోగంతో కుదిరి చావడం లేదన్నావ్? ఇప్పుడెందుకు రాయ కూడదూ?"

## జి.ఎస్.ఆర్.మూర్తి మెమోరియల్ నాటక పోటీలు

ప్రఖ్యాత రంగస్థల, సినీనటుడు, దర్శకుడు స్వర్గీయ జి.ఎస్.ఆర్.మూర్తి సంస్మరణార్థం యిదివరకటివలెనే ఈ ఏడాది కూడా జి.ఎస్.ఆర్.మూర్తి మెమోరియల్ నాటక పరిషత్ అక్టోబర్ 19 నుంచి 23 వ తేదీ వరకు అఖిల భారత స్థాయిలో నాటక, నాటిక పోటీలు నిర్వహించదలచింది.

ఈ పోటీలో ప్రదర్శించే నాటకాలకు, నాటికలకు యీ క్రింది విధంగా బహుమతు లుంటాయి:

ప్రదర్శించిన ప్రతి నాటకానికి రూ.1200
ప్రథమ బహుమతి 2500 రూపాయలు
ద్వితీయ బహుమతి 2000 రూపాయలు
ఉత్తమ రచన 500 రూపాయలు
ప్రదర్శించిన ప్రతి నాటికకు రూ. 750
ప్రథమ బహుమతి 2000 రూపాయలు
ద్వితీయ బహుమతి 1500 రూపాయలు
ఉత్తమ రచన 300 రూపాయలు

## సమాచారమ్ సమాచారమ్

దరఖాస్తులు 19-8-1985 లోగా
ప్రధాన కార్యదర్శి,
జి.ఎస్.ఆర్.మూర్తి మెమోరియల్ నాటక
పరిషత్, కేరాఫ్ స్వదేశీ ఖాదీ భాండార్,
ఏలూరు రోడ్డు, విజయవాడ—2. కి పంపాలి

## గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డు

కడప రచన సాహిత్యవేదిక గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డుకై 1-1-1980 నుంచి 31-12-1984 మధ్య కాలంలో వెలువడిన పద్య కావ్యాల్నీ, పద్య కవితా సంపుటాన్ని పంపవలసిందిగా కోరుతోంది. ఒకే కవి రచించిన గ్రంథాలే పంపాలి. అనువాదాలు, పునర్ముద్రణలు పంపరాదు. అవార్డు సొమ్ము రచయితకే యిస్తారు. పుస్తకాలను నాలుగు ప్రతులు పంపాలి.

చిరునామా: జె.ఎస్.మూర్తి,
ఎ—1—9—ఎల్.ఐ.సి. క్వార్టర్స్,
కడప — 516 004.

పుస్తకాలను 31—8—1985 వ తేదీలోగా పంపాలని కార్యవర్గం తెలిపింది.

"రాయాలోయి. రాయాలి. మంచి థీమ్ కోసం చూస్తున్నా." అన్నాను.ఏదో వక కారణం చెప్పి తప్పించుకోవాలని.

"బాగుందోయ్. థీమ్‌లు బజార్లో దొరుకుతాయా ఏమిటి? ఈ ప్రపంచంలో ఎన్ని సమస్య లు లేవు? ఏదో సమస్య తీసుకుని దాన్ని సాగదీసి, పరిష్కరించి పారెయ్యడమే... చెయ్యాల్సిన పని." అన్నాడు.

నేను నవ్వి వూరుకున్నాను.వెనకటి రోజులు గుర్తుకొచ్చేయి.ఆ రోజుల్లో-అంటే పదేళ్ళక్రితం పుంఖానుపుంఖంగా పత్రికలనిండా నేనూ విశ్వనాథం కథలను నింపుతూండే వాళ్ళం. ఇద్దరమూ విజయవాడలో వుంటూండే వాళ్ళం. రోజూ సాయంత్ర మప్పుడు ఏ పార్కులోనో, కాఫీహోటల్లోనో కల్సుకుని కాస్సేపు ప్రస్తుతం వచ్చే సాహిత్యం గురించి బాధపడి మేము రాయబోయే 'వుత్తమసాహిత్యం' గురించి చర్చించుకుంటూ వుండేవాళ్ళం. విశ్వనాథం అంత విస్తృతంగా ఆ తర్వాత తర్వాత నేను రాయలేక పోయేను.విశ్వనాథం అదో తపస్సుగా, దీక్షగా, పంతంగా రాసేవాడు. నేనేదో అప్పుడప్పుడు రాస్తూ, ఆ తర్వాత అసలే రాయడం మానివేసేను. విశ్వనాథం అట్లా దీక్షగా వ్రాసినందువల్లే గొప్ప పేరు పొందిన రచయిత అయ్యేడు. ప్రభుత్వ బహుమతులు, సత్కారాలు కూడా అందుకున్నాడు. ప్రస్తుతం విశ్వనాథం పేరు ఎరగని పాఠకుడు వుండడని చెప్పవచ్చును.

"అదిసరేగాని, నువ్వు యీవూ రొచ్చి ఎన్నాళ్ళయింది? రిటైర్ అయి ఏంచేస్తున్నావు? పిల్లలు ఎదిగి వచ్చేరా?" అని అడిగేడు, అక్కడి జవాన్‌కి రెండు కాఫీలు తెమ్మని పురమాయించి.

"మా అబ్బాయికి యీ వూళ్ళోనే ప్రయివేటు కంపెనీలో చిన్న వుద్యోగం అయిందోయి. రెండవ సంతానం అమ్మాయి. అది బి.కాం. ప్యాసయింది. వుద్యోగం ఏం లేదు. పెళ్ళి చెయ్యాల్సి వుంది.మూడో సంతానం పుత్ర రత్నం. ఇంటర్ చదువుతున్నాడు. రిటైర్ అయి విజయవాడలో చేసేదేముందని, నేనూ నాపిల్లలు పెద్దవాడి దగ్గరకే వచ్చేసి వుంటున్నాం. ఏదో నాకొచ్చే పెన్షన్ డబ్బులూ మావాడి జీతమూ కలబోసుకుని కాలక్షేపం చేస్తున్నాం. సరిపోవడం లేదనుకో, అయినా అట్లాగే తంటాలు పడ్తున్నాం."

"బాగుందోయి. నీ కొచ్చిన గ్రాట్యూటీ, పి.యఫ్.డబ్బుతో. అమ్మాయి పెళ్ళి చేసెయ్యక పోయేవా?" అని అడిగేడు విశ్వనాథం.

"అదే కుదిరి చావడం లేదు. విజయవాడలో వున్న అప్పుసొప్పు తీర్చేసి మిగిలిన పదివేలతో యీ వూరొచ్చి పడ్డాము. ఆ మిగిలిన డబ్బుతోనే ఆఖరి వాడి చదువు, యింటి ఖర్చులూ వెళ్ళదీస్తున్నాం. అమ్మాయి పెళ్ళికి కనీసం యిరవయి వేలు కట్నం పొయ్యనిదే, మంచి సంబంధం వచ్చేట్టు లేదు. నాసంగతి చూస్తే పదివేలు కంటే ఖర్చుచేసే తాహతులేదు. అదే పెద్ద బాధ అయిపోయింది." అని నిట్టూర్చి అతను అందించిన కాఫీ వూదుకుంటూ త్రాగ సాగేను.

"మీ పెద్దవాడికయినా పెళ్ళి చేసేవా?"

"మనం చేసేదేముంది. వాడే ఎవర్నో ప్రేమించి పైసాఖర్చు లేకండా ప్రేమ వివాహం చేసుకున్నాడు." అని చెప్పేను.

"మరి అమ్మాయిని కూడా ఆ పంపిణీ మీదే ఎవరినైనా ప్రేమించెయ్య మనలేక పోయావు?" అని విరగబడి నవ్వసాగేడు తన జోక్‌కి తానే యిదయిపోయి.

"దానికా తెల్వితేటలు వుంటే బాగానే వుండిపోను.ఒఠి సత్తెకాలం మనిషి. సినిమాలు కూడా గట్టిగా చూడదు." అన్నాను.

"అదా సంగతి. ఈ రోజుల్లో సినిమాలు చూడకపోతే ఎల్లాగోయ్? అదిసరేగాని...ఓ పని చేస్తావూ?" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

"ఏమిటది?" అడిగేను.

"ఒకళ్ళ జీవిత చరిత్ర వ్రాసిపెడతావూ?" అడిగేడు.

"ఏమిటీ? జీవిత చరిత్రా? నీకేం మతిపోయిందా?" అన్నాను.

"ఏం? తప్పేమిటి?" అన్నాడు కనుబొమలు ఎగరవేస్తూ.

"తప్పని కాదు!. కథ రాయడానికే నానా హైరానా పడేవాడ్ని జీవితచరిత్ర రాయడమా? ఈత నేర్చుకునేవాడిని ఇంగ్లీషుఛానల్ యీదమని అడగడంలాగ వుంది?" అన్నాను నవ్వేస్తూ.

"నవ్వులాటకి కాదోయ్. సీరియస్‌గానే చెబ్తున్నా. ఇరవయి ఏళ్ళనుంచి-అడపా తడపాయేననుకో కథలు రాస్తున్న వాడివి. ఆ మాత్రం-జీవిత చరిత్రే రాయలేరా? ఎంతో వుండదు.వంద పేజీలు! చాలు." అన్నాడు నావైపు తదేకంగా చూస్తూ.

"వంద పేజీలా!ఇంతవరకు కనీసం పక్కా

నవల కూడా రాయలేదు కదోయ్.'' అన్నాను నా బాధను అర్థం చేసుకుంటాడనే వుద్దేశంతో.

''చూడు నాయనా! నలభయి,యాభయి పేజీల నాటకాలు స్టేజికి రాసేవు కదా! మరి నవల రాయడానికేం వచ్చే?''

''నాటకం దారి వేరు.మనం రకరకాల స్వభావాల మనుషుల్ని చూస్తుంటాం. వాళ్ళను మనస్సులో పెట్టుకుని ఏదో వస్తువు తీసుకుని డెవలప్‌చేసుకుంటాం. ఇదట్లా కాదే! ఆ మనిషిని కనీసం నేను చూసైనా వుంటానో లేదో... వక్కసారైనా?'' అంటూ చెప్పి తప్పించుకోబోయేను.

విశ్వనాథం వదలలేదు. జీడిలాగ పట్టుకున్నాడు.

''చూడవోయి! ఆ మనిషిని నువ్వు చాలా సార్లు చూసేవుంటావు. ఇంక ఎట్లా రాయాలో, ఏం రాయాలో నేను నీకు చెబుతాను. కావలసిన సహాయం సహకారాలన్నీ నీకు అందచేస్తాను. చాలా?''

ఏమిటోయ్,నిజంగానేనా ఏమిటి? నేను యిప్పుడే వచ్చేస్తానని చెప్పి వచ్చేను యింట్లో. ఆలస్యం అయితే మా యిల్లాలు ఖంగారు పడుతుంది...నన్నొదిలెయ్యియింక.''అన్నాను.

లేదు రామం. నేను సీరియస్‌గానే చెబుతున్నాను. నువ్వు తేలికగా రాయగలవు. రాయలేకపోయినా నీవెనక నేను వుండి, ఎట్లారాయాలో చెప్పి రాయించగల్ను. ఎందుకు పోగొట్టుకుంటావు వృథాగా యిరవయివేలు!'' అన్నాడు.

నాకు గుండె ఆగినంత పని అయింది. నా చెవులు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనే అనుమానం వచ్చింది. నోరు తెరుచుకుని విశ్వనాథం వైపే చూస్తూ వుండిపోయేను... ఆశ్చర్యంతో!

''అవునోయి...ఇరవయివేలు! చేదా?'' అన్నాడు.

ఇరవయివేలు! చేదా? ఎవడంటాడు ఆమాట? ఎన్నాళ్ళు గవర్నమెంటు సర్వీసుచేస్తే యిరవయి వేలు వస్తాయి? ఎన్ని కథలు, ఎన్ని నవలలు వ్రాస్తే యిరవయి వేలు వస్తాయి? ఒకటి కాదు, రెండు కాదు, యిరవయి వేలు! నాబుర్ర వేడెక్కిపోసాగింది.నాకు వూపిరి ఆడక వక్కక్షణం వుక్కిరి బిక్కిరి అయి, అంతలో తేరుకుని,

''అవును. ఇరవయివేలు చేదేమిటి నా మొహం!'' అనేసేను.

**వివక్ష**

ఇంటర్‌లో
మెరిటొచ్చిన కూతుర్ని
సెరటేదారి పట్టించారు
టెన్త్‌లో
పదవసారి తప్పిన
పుత్రరత్నానికి మాత్రం
ట్యూషన్లు పెట్టించారు

—జానీ

''మరి వ్రాస్తావా?''

''నన్ను కాస్త ఆలోచించుకోనీ'' అన్నాను.

''ఇట్లా ఆలోచించి ఆలోచించే, ఎందుకూ పనికి రాకండా పోతున్నారు నీ లాంటి వాళ్ళు. వంద పేజీలు, చెత్తో,బొత్తో ఏదో వకటిరాసి పారేసి, యిరవయి వేలు తీసుకునేడానికి ఏదో ఆలోచిస్తావట్ట, ఆలోచన.'' అన్నాడు విశ్వనాథం ఎత్తిపొడుపుగా.

నిజమే. ఆలోచనలు లేని వాడు అదృష్టవంతుడు. ఆలోచనలు వున్నవాడికే లక్షాతొంభయి భయసందేహాలు! సరే ఎట్లాగో ఓపిక చేసుకుని, ఓ పట్టు పట్టి వక నెలరోజుల్లో ఆ వంద పేజీలు రాసి పారేస్తామనుకో. ఇంతకూ ఎవరిదో ఆ జీవిత చరిత్ర? నేను చూసిన వ్యక్తిదే అంటున్నాడు...విశ్వనాథం. ఇరవయివేలు రచయితకి యిచ్చి జీవిత చరిత్ర వ్రాయించుకోగల్గిన వ్యక్తి ఎంత గొప్పవాళ్ళయివుండాలి? అటువంటి వ్యక్తిని తను ఎప్పుడు చూసి వుంటాడు? అంతా చిత్రంగా 'మిష్టరీ' గా వున్నట్లుంది.

''ఆ జీవిత చరిత్ర వ్రాయించుకోబోయే వ్యక్తిని గురించి నాకేం తెలియదే?'' అన్నాను. విశ్వనాథమే బయటికొచ్చి యింకొంచెం వివరాలు యిస్తాడనే ఆశతో.


''ఆ వ్యక్తి దగ్గరకు మనం వెళదాం. రెండు మూడు సార్లు కల్సుకుని అవసరమైన విషయాలన్నీ సేకరిస్తాం. ఆపైన ఏదో ఫైవ్‌స్టార్ హోటల్లో ఓ ఎయిర్ కండిషన్డు గదిలో కూర్చుని యిరవయి రోజుల్లో రాయవలసిన పుస్తకం రాసి పారెయ్యడమే. ఆ హోటల్లో నీకు కావలసిన సదుపాయాలన్నీ సమ కూర్చబడతాయి. నువ్వు గడపదాటి వెళ్ళవలసిన అవసరం కూడా కలగదు.'' అన్నాడు చిర్నవ్వుతో విశ్వనాథం.

''అమ్మబాబోయి! ఫైవ్ స్టార్‌హోటలే! మన కిచ్చే డబ్బు కాస్తా ఆ హోటలుకే అయిపోయేట్లుందే.'' అన్నాను... ఖర్చు తల్చుకుని మూల్గుతూ.

''నువ్వు వట్టి వెర్రివాడిలా వున్నావోయ్. నువ్వు హోటలులో అడుగుపెట్టినప్పటి నుంచీ, మళ్ళీ యివతలకు వచ్చేవరకు ఖర్చులతో నీకేం సంబంధంలేదు. అవన్నీ భరించే వాళ్ళు వేరే వున్నారు. నీ పనల్లా కావలసిన సుఖాలన్నీ అనుభవిస్తూ, ఆ పుస్తకం పూర్తిచెయ్యడమే. నీకు చేదోడు వాదోడుగా నేను వుంటాను. నువ్వేం భయపడనఖ్ఖర్లేదు.'' అన్నాడు విశ్వనాథం.

''ఏమిటో అంతా ఆశ్చర్యంగా వుంది. నా చెవుల్ని నేనే నమ్మలేకుండా వున్నాను. ఇదేదో సినిమా కథలా వుంది.'' అన్నాను.

''కరెక్టుగా చెప్పేవు. ఇది సినిమా వాళ్ళకి



సంబంధించిన కథ. అందుకే సినిమా కథలాగ వుంది.'' అన్నాడు విశ్వనాథం నవ్వేస్తూ.

ఎందుకో వులిక్కి పడ్డాను. సినిమా వ్యక్తిని గురించా నేను వ్రాయవలసినది? ఇంతవరకు ఏ రాజకీయ నాయకుడో, పారిశ్రామికవేత్తో కథా నాయకుడు అనుకున్నాను. సినిమావ్యక్తే కథా నాయకుడా? ఎందుకో నాకు గొంతుకకు ఏదో అడ్డుపడ్డట్లు అయ్యింది. ఒక్కసారి అక్కడ నుంచి పారిపోదా మన్పించింది. కారణం తెలియ కుండానే 'అనీజీ'గా కూర్చీలో అటు యిటు కదిలేను.

''ఏం అట్లా అయిపోయేవు? సినిమావ్యక్తి అంటే నీ వుద్దేశంలో మిగతా వాళ్ళకంటే తక్కువ అనా?''

''అబ్బే...అదేం కాదు...'' అని గుటకలు మింగేను.

''చూడవోయి రామం.చలనచిత్ర పరిశ్రమ లో పనిచేసే వాళ్ళు కూడా మనుషులే. వాళ్ళకూ వ్యక్తిత్వం వుంది. అహర్నిశలు కష్టపడి పనిచేస్తారు. మిగతా వారిలాగే సమాజంలో వచ్చే వుపద్రవాలకి చలించిపోతారు. అందుచేత రాజ కీయ నాయకుడుగాని, మరొకడుగాని ఎక్కువని, వీళ్ళు తక్కువని అంచనా వెయ్యకూడదు. కళాకారుడి స్థానం సమాజంలో తక్కువదేం కాదు.''

''అదిసరే...నువ్వు చెప్పింది కాదనను. ఉన్నవీ లేనివీ కల్పించి గొప్పగా రాయడం నావల్ల కాదేమో నోయి.'' అన్నాను... ఏమేమో వూహించుకుంటూ.

''ఏం? కథల్లో నువ్వంతా వున్నదివున్నట్లు రాస్తున్నావా? లేనిది వున్నట్లు, వున్నది లేనట్లు నిజానికి కొంత అసత్యాన్ని జోడించి, నీ కల్పనా చమత్కృతిని వుపయోగించి కథను అల్లడం లేదా? అయినా వాళ్ళు చెప్పింది నువ్వు రాయి. అది అబద్ధమో,నిజమో నిర్ణయించడానికి మనం ఎవ్వరం?''అన్నాడు విశ్వనాథం.

''అవును. అదీ నిజమే. వాళ్ళు నిజమని చెప్పినదాన్ని మనం నిజంగానే స్వీకరించాలిగాని, కాదనడానికి మనం ఎవరం? అయినా వాళ్ళ జీవితాన్ని గురించి మనకేం తెలుసు?''

అదీ...అట్లా వుండాలి ఆలోచనంటే! ఇటు చూడు రామం. తను ఎనిమిదో ఏటనే నాటకాల్లో వేషాలు వేసి పేరు తెచ్చుకున్నానే చెప్పుతుందనుకో ఆ నటి. మనం నమ్ముతాం. మనదేం పోయింది? ఆ విషయమే కొంచెం

> ## తరంగాలు
>
> మదిని సుడి గుండముల పీడ వదిలి పోయి
> ముడులు విడిచెడు బిరులు సడలుచుండు
> అందముల దర్శనానంద మందుగాన
> ధరను అందమే ప్రత్యక్ష దైవతమ్ము
>
> —కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

అందంగా, అలంకారాలతో వర్ణించి చెబుతాం. ఏమంటావు?'' అన్నాడు.

''ఆగు. ఆగు. నటి అంటున్నా వేమిటి? ఇప్పుడు మనం రాయబోతూన్నది సినీనటి జీవిత చరిత్రా?'' అన్నాను ఆశ్చర్యంగా.

''అవును. ఏం? నటుడ్ని గురించి వ్రాయ డానికి అంత అభ్యంతరం దేనికి, నటిని గురించి వ్రాయడానికి అభ్యంతరం వుంటుందా?'' అన్నాడు విశ్వనాథం చిరుకోపంతో.

''ఏమోనబ్బాయి. నాకంతా చాలా గంద్ర గోళంగా వుంది. నేనుకొంచెం ఆలోచించు కోవాలి.'' అన్నాను నిశ్చయంతో.

నాముఖంలోని భావాలను చదివిన వాడిలాగ, కొద్దిగా నవ్వి, ''ఆలోచించుకోవోయి... బాగా ఆలోచించుకో నాకే సంగతి వారం రోజుల్లో చెప్పు. నేను ఏ సంగతి వాళ్ళకు తేల్చి చెప్పాలి. కాని ఒక సంగతి గుర్తుంచుకో. ఇరవయి వేలు తక్కువ మొత్తం కాదు. ఈ మొత్తంలో సగం డబ్బు యిస్తామంటే మహామహావాళ్ళు ఎగిరి గంతేసి 'ఆఫర్' అందుకునేందుకు సిద్ధమవు తారు.ఎందు కొచ్చిందో మన దగ్గర కొచ్చింది ఈ అవకాశం. కాక తాలీయంగా నువ్వుకూడా యిసాడే కన్పించేవు నాకు. చిరకాల మిత్రుడు కదా అని నీకు చెప్పేను నేను. కాని వక్కటి మాత్రం గుర్తుంచుకో. ఇరవయివేలు వాళ్ళకు ఒక లెక్కలోకి మొత్తం కాదు.తక్కువ మొత్తం కాదు. కాని నీలాంటి వాళ్ళకు-రక్తంధార పోసి సంవత్సరం శ్రమించినా సంపాదించలేని మొత్తం అది. అందుచేత లేనిపోని భేషజాలకు, ఆదర్శాలకు పోయి, చేతికి రాబోతూన్న సిరిని విసిరి కొట్టకు. బాగా ఆలోచించుకునే నాకు ఓ వారం తర్వాత వచ్చిచెప్పు.'' అన్నాడు విశ్వనాథం.

విశ్వనాథం మాట్లాడుతూన్నంతసేపూ అతని ముఖ కవళికలను గమనిస్తూనే వున్నాను. అతని మాటలు వింటూనే వున్నాను. రకరకాల ఆలోచిస్తూనే వున్నాను.

క్షణంసేపు మౌనంగా వుండి, ''విశ్వనాథం నేను వకటి అడుగుతాను, నిజం చెబుతావా?'' అన్నాను.

''ఓ.అట్లాగే అడుగు.'' అన్నాడు చిర్నవ్వుతో.

''ఇందులో నీకెంత గిట్టుబాటవుతుంది. నేనేంబాధపడను. నిజం మాత్రం చెప్పు.'' అన్నాను. నిశితంగా విశ్వనాథం ముఖంవైపే చూస్తూ. ప్రశ్న అడిగిన తర్వాత నా సూటి ప్రశ్నకు నేనే ఆశ్చర్యపోయి, నన్నునేనే నిందించు కున్నాను, తొందర పడ్డానేమోనని.

విశ్వనాథం ,ఆశ్చర్యపోలేదు. బాధపడలేదు. పయిగా విరగబడి నవ్వసాగేడు. అతనట్లానవ్వ డంతో నామనస్సు కాస్త తేలికపడింది.

''నువ్వంటే నాకు అందుకే మొదటి నుంచీ యిష్టం. వచ్చిన అనుమానం మనస్సులో పెట్టు కుని బాధపడవు.మోహం ఎదటే స్పష్టంగా అడుగుతావు. అది చాలా మంచిది కూడాను. ఇహ అసలు విషయానికొస్తా. ఆవిడ చాలా పేరు ప్రఖ్యాతులున్న స్టార్. ఇది వరకు ఒకో చిత్రానికి 70,80 వేలు పుచ్చుకునేది. కనీసం సంవత్స రానికి ఇరవయి సినిమాలలో నటించేది. గత అయిదేళ్ళ నుంచి చిత్రానికి లక్ష పుచ్చు కుంటోంది. నెలకి సగటున ఒక చిత్రంలో నటిస్తోంది. ఇప్పుడు చిత్రానికి 2 లక్షలు పుచ్చు కుంటోంది.రెండునెలలకి వక చిత్రంలోనే నటిస్తోంది. అంటే ఆవిడ పుచ్చుకునే తెల్లధనం చిత్రానికి లక్షరూపాయలే. మిగతా లక్షాబ్లాక్‌లో తెల్లధనంలో వచ్చే లక్షలోన మనిద్దరికే కలిపి యిచ్చేది సగం మాత్రమే. అంటే నాకుముట్టేది ముప్పయివేలు. నీకు వచ్చేది యిరవయివేలు.ఇది నాయనా సంగతి!' ''అన్నాడు విశ్వనాథం కుర్చీలో వెనకకు జేర్లబడి కూర్చుంటూ.

నాకునోటి వెంట మాట రాలేదు. వంద పేజీల రచనకు యాభయివేలా? కష్టపడి రాసిన వాడికి యిరవయి వేలా? పర్యవేక్షించిన వాడికి ముప్పయి వేలా? ఇదంతా న్యాయమా అన్యాయమా? నాకు బుర్ర తిరిగి పోతూన్నట్లని పించింది. అయినా విశ్వనాథం ప్రమేయం లేనిదే యీ వ్యవహారం నావరకు రాదు కదా? నాకు అసలు తెలియను కూడా తెలియదు కదా?

పైగాకథంతా,తుదివరకు నడి పేది అతనే కదా? అటువంటి సందర్భంలో

విశ్వనాథం ఎక్కువ తీసుకుంటున్నాడని నేను బాధపడటం అర్థరహితం అన్పించింది. నా చవకబారు ఆలోచనలకు నన్ను నేనే నిందించు కుని, ''మరివస్తాను.'' అంటూ చిర్నవ్వుతో లేచినిలబడ్డాను.

''అట్లానే,వెళ్ళిరా. బాగా ఆలోచించుకో. అవకాశం జారవిడుచుకోకు. మనం కాక పోతే. చాలా మంది రాస్తారు, గుర్తుపెట్టుకో.'' అన్నాడు విశ్వనాథం లేచినిలబడి కరచాలనం చేస్తూ.

కలలో నుంచి బయటపడినట్లు, ఆ ఆఫీసులో నుంచి యివతలకు వచ్చి పడ్డాను. రంగు అద్దాలలో నుంచి చూసి నట్లు ప్రపంచమంతా చిత్రంగా అవుపించసాగింది. మనకు తెలియనివి, అర్థంకానివి యీ ప్రపంచంలో ఎన్నో ప్రపంచాలు,ఒకోమనిషిలో ఒకో ప్రపంచం వున్నదన్న సంగతి స్పష్టంగా అర్థం కాసాగింది.

ఇంటికి వెళ్ళాను. చాలా దీర్ఘంగా, నిశితంగా, విషయం గురించి ఆలోచించేను. నా ఆలోచనల గురించి ఆలోచించేను. నా భూత, భవిష్యత్, వర్తమానాల గురించి కూడా ఆలోచించేను. ఎంత ఆలోచించినా యిరవయి వేల బరువు ఎక్కువగానే వున్నట్లు కన్పించసాగింది. సినీ నటులు కూడా మనుషులేననీ, వాళ్ళల్లోనూ కళకు జీవితం అర్పించిన వాళ్ళు వున్నారనీ, అనేక లక్షలు ప్రజోపయోగకరమైన కార్యాలకు దానం చేసిన వారున్నారనీ, వాళ్ళు ఎవ్వరికంటె కూడా తక్కువ వ్యక్తులు కారనీ వక నిర్ధారణకు వచ్చేను. ఇరవయివేలు వుంటే, నేను దాచిన ప్రావిడెంటు ఫండ్ తాలూకు ధనం యిరవయి వేలతో కలిపి, వున్న ఖాళీ స్థలంలో రెండు గదులు వేసుకుని నెమ్మదిగా చిన్న కొంప వకటి ఏర్పరచుకో వచ్చుననే భావం కూడా నాతో గూడుకట్టుకొనసాగింది. రెండుగదులతో మంచి యిల్లు యీ రోజుల్లో కట్టలేం. కనీసం నాలుగు గదులన్నా లేనిదే యిల్లు అనడానికి వీలువుండదు. కాని దానికి సుమారు ఎనభయి వేలన్నా కావాలి. అది యింతలో గాని మును ముందుగాని నావల్ల అయ్యేపనికాదు. అన్ని లక్షలు బ్లాకులో సంపాదిస్తూన్న ఆ సినీనటి, వక లక్ష రూపాయలు యిస్తే, నాలుగుగదులున్న చక్కటి భవంతి కట్టు కోవచ్చును. కాని ఆవిడెందుకు యిస్తుంది? ఆ మాటకి వస్తే అంత ఎందుకు యివ్వాలి?నా పిచ్చి ఆలోచనలకి, దురాశకి నేనే నవ్వుకున్నాను. నా మనస్సును నిందించుకున్నాను. వెర్రిమొర్రి ఆలోచనలను కట్టిపెట్టమని అయినా ఎవ్వో ఆలోచనలు తేనెతుట్టులోని ఈ గల్లాగ ఎగురు తూనే వున్నాయి.

వారం అవ్వగానే విశ్వనాథం ఆఫీసుకి వెళ్ళేను. విశ్వనాథం సాదరంగా నన్ను ఆహ్వానించి కాఫీ తెప్పించేడు. కాఫీ వచ్చేలోగా నాకు కావలసిన పర్మిట్ ఆర్డరు కాగితాలు నాచేతిలో పెట్టేడు.

అతనికి కృతజ్ఞత తెలుపబోగా ''ఈ మాత్రం దానికే అంతంత పెద్దమాటలు ఎందుకుగాని, నేను చెప్పిన విషయం ఏం ఆలోచించేవు?'' అని అడిగేడు.

''చెబుతానుగాని, వకచిన్న సందేహం వుంది. అది కూడా తీర్చాలి.'' అన్నాను.

''ఊ! అడుగు. ఆలస్యందేనికి?'' అన్నాను.

ఇంతకూ యీ పుస్తకం ఎవరి పేరు మీద వుంటుంది?'' అడిగేను.

''ఏం? నీ పేరు మీదే వుంటుంది.'' అన్నాడు విశ్వనాథం.

''నీ పేరు ఎందుకు పెట్టుకో కూడదు?'' అన్నాను.

''ఈ వంద పేజీల పుస్తకం నేను రాయలేకనే నిన్ను రాయమంటున్నాను అనుకున్నావా? నేనైతే వారం రోజుల్లో రాసి అవతల పారెయ్యగలను.'' అని చెప్పేడు విశ్వనాథం మామూలు స్వరంలోనే, ఏమీ తొణక కు ండా.

''మరి నాచేత ఎందుకు రాయిస్తున్నావు? నాపేరు ఎందుకు పెడ్తున్నావు? కోపం తెచ్చుకోకు. ఆ యాభయివేలూ నీకే వుంటాయిగా? నీకు మాత్రం డబ్బంటే చేదు కాదు కదా?'' అనేసాను గబగబా.




''చూడు రామం. డబ్బంటే నాకేం చేదు కాదు. ఆమె మొత్తం పాతిక యిస్తానంటే, కాదు కూడదని యాభయివేలకి బేరం కుదిర్చేను. పుస్తకానికి నాపేరే వుండాలని ఆమె పట్టుపట్టింది అసలు. కాని నేను వప్పుకోలేదు. నా సహకారం వుంటుందని చెప్పేను. నాపేరు వుంటే 75వేలు యిస్తానంది ఆఖరికి. నేను ససేమిరా అంగీకరించలేదు. ఆఖరికి నాపేరు లేక పోయినా పేరున్న రచయితది ఎవరిదయినా వుండటానికి వప్పుకుంది. కాని నా పర్యవేక్షణ వుండి తీరాలంది. అదీ సంగతి. ఇంతకూ నీ బాధేమీటో అర్థం కాలేదు. మరోఅయిదు వేలుకావలంటే తీసుకో.''అన్నాడు విశ్వనాథం.

''అబ్బే! నేను ఆలోచిస్తున్నదల్లా వక్కటే. ఆవిడ జీవిత చరిత్రను బాగా పేరు మోసిన రచయితయే ఎందుకు రాయాలని కోరుతోందో అని.'' అన్నాను.

''పేరు వున్న రచయిత వ్రాస్తే పాఠకులకు రచనపైన గౌరవం వుంటుందని. అదో వెర్రి నమ్మకం... అంతే.'' అన్నాడు విశ్వనాథం నవ్వేస్తూ.

''ఇంతకూ నీ పేరు పెట్టుకోక పోవడానికి నువ్వు ఎందుకు అంగీకరించలేదో నాకు చెప్పనే లేదు.'' అన్నాను.

విశ్వనాథం నావైపు కొంచెం యిబ్బందిగా చూసేడు వక్కక్షణం. మళ్ళీ మరుక్షణంలో తేరుకుని, ''అబ్బే! పెద్దకారణం ఏమీలేదు. వద్దనుకున్నాను. అంతే.'' అన్నాడు.

''అంతేనా,లేక పోతే ఆరచనపైన నీపేరు వుంటే నీ గౌరవం,పరువు దెబ్బ తింటాయనుకున్నావా?'' అన్నాను సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ.

మోకాలిపైన తుపాకి దెబ్బ తగిలినట్లు గిలగిల లాడేడు విశ్వనాథం.మొహం పాలిపోయింది. అయినా తట్టుకుని, నవ్వును తెచ్చిపెట్టుకుని, ''చూడవోయి రామం. ఆవిడకు జీవిత చరిత్ర కావాలి. మనకు డబ్బు కావాలి. అవునా? కావాలి అనుకుంటే రాద్దాం. లేకపోతే మానుకుందాం. ఏమంటావు?'' అన్నాడు యీ చర్చలన్నీ అనవసరం అనుకుంటూన్నట్లు.

''అవును. డబ్బు కావాలి. నిజమే! అందుకే కదా నీతో యింత వివరంగా మాట్లాడటం! అయితే మరోసంగతి చెప్పు. ఆవిడ పేరేమిటి?'' అన్నాను పేరున్న నటీమణో కాదో తెల్సుకోవాలనే కుతూహలంతో.

"ఊహు. అవన్నీ యిప్పుడు చెప్పను. నవ్వు రాయడానికి అంగీకారానికి వస్తే అప్పుడు నీకు అన్నీ చెప్పడమే కాదు, ఆమె దగ్గరకు తీసు కెళ్తాను కూడాను. అప్పుడు నీకు కావలసిన వివ రాలన్నీ కూడా అడగొచ్చును. ప్రస్తుతానికి మాత్రం ఆవిడ ఒక ప్రసిద్ధ నర్తకీమణి అని తెల్సుకుంటే చాలు." అన్నాడు విశ్వనాథం.

"ఏమిటి నర్తకీమణా? నటీమణి అన్నావు." అన్నాను ఆశ్చర్యంతో.

అవును. వాళ్ళిద్దరికీ పెద్ద వ్యత్యాసం ఏముంది? ఒకరు నటిస్తారు. మరొకరు నాట్యం చేస్తారు. ఇద్దరూ కళాకారులే కదా?" అన్నాడు తేలికగా.

ఆమె నటీమణి కాదనీ, నర్తకి అని తెలిసే సరికి నాలో వున్న వూగులాట ఆగిపోయింది. నావుత్సాహం కాస్త చచ్చిపోయింది. నేను జావ కారి పోయేను. వెనకకు రావడం ఎట్లాగా అని ఆలోచించసాగేను.

"ఏమిటే మళ్ళీ ఆలోచనలో పడ్డట్టున్నావు? ఇద్దరూ తెరమీద వెలిగే వాళ్ళే. ప్రజలను రంజింప చేసేవాళ్ళే. ప్రొడ్యూసర్ల వద్ద నుంచి లక్షలకి లక్షలు తీసుకునే వాళ్ళే. వాళ్ళ పేరు వుంటే జనం చొక్కాలు కూడా చింపుకుని సినిమాలకు ఎగబడేవారే. ఇంకమనకి ఎవరయితే ఏం బాధ?" అన్నాడు.

నర్తకీమణి అంటే కూచిపూడి, భరత నాట్యం వగైరా నృత్యాలు చేసే నర్తకీమణేనా?" అన్నాను మళ్ళీ ఏదో అనుమానం వచ్చి.

"నీకు బాగుపడే లక్షణాలు బొత్తిగా లేవోయ్." అన్నాడు.

"అదేం?" అడిగేను.

"మరి యీ ధర్మసందేహాలన్నీ ఏమిటి?" అన్నాడు.

చెప్పకూడదా?" అన్నాను.

"ఎందుకు చెప్పకూడదూ! మహారాజులాగ చెప్ప వచ్చును."

"మరయితే చెప్పు."

"కాదు." అన్నాడు ముక్తసరిగా.

"మరి?" అడిగేను ఆశ్చర్యంగా.

"శృంగార రస భరిత నృత్యాలు చేసే నర్తకి. కౌపీనం లాంటి వస్త్రం ధరించి,చేతి రుమాలు వంటి గుడ్డను గుబ్బగుబ్బలకు అడ్డంపెట్టుకుని, క్లబ్‌సీనుల్లోనూ, విలన్ ముందు, అప్పుడప్పుడు హీరోముందు, శృంగార గీతాలకు అనుగుణంగా ఆడుతూ తన శరీరసౌష్ఠవాన్ని ప్రదర్శించే నర్తకి. ఆమె చూపుల్లో కావలసినంత కైపు వుంటుంది. ఆమె కొంటెగా అధరం పంటితో నొక్కిందంటే మధురం వలుకుతుంది. ఆమె వక్షోజాల భారానికి జనం తల్లడిల్లి పోతారు. ఆమె నడుం వూపితే ప్రేక్షకులు మత్తెక్కి ప్రక్కవారిపైన వరిగి పోతారు.ఆమె వూరువులు వూపితే యింక జనం ప్రక్క జనం పైన వరదలాగ విరుచుకుని పడిపోతారు.అది నాట్యమా? రసజ్ఞుల గుండెల్లో దాచుకున్న శృంగార వీణాతంత్రులపైన సాగే లాస్యవిన్యాసం బాబూ! అందుకే ఆమె లేని సినిమా లేదు. ఆమె వుండి ఫెయిలయిన సినిమా అంత కంటె లేదు." అన్నాడు విశ్వనాథం వుత్తేజంతో.

మెరుపుదెబ్బ తిన్నట్లు నా మెదడు దిమ్మెర పోయింది. నన్ను నేను సంబాళించుకుని, లేచి నిలబడ్డాను.

"అదేమిటి నువ్వులేచేవు? కూర్చో. కూర్చో." అన్నాడు చిర్నవ్వు చిలకరిస్తూ.

"అబ్బే లేదు. నేను యింటికి వెళ్ళాలి." అన్నాను.

అదేమిటోయ్! పుస్తకం రాయవా?" అన్నాడు.

"ఊహు." అన్నాను ధృఢ నిశ్చయంతో.

"అంత డబ్బు వదులు కుంటావా? అదేం?" అన్నాడు విశ్వనాథం ఆశ్చర్యంగా.

"చూడు విశ్వనాథం! పాపం ఆ అమ్మాయి ఎన్నికష్టాలలో వుందో మరి-ఆ కష్టాలను యీద లేక, ఆత్మగౌరవాన్ని చంపుకుని, విలువలను మరచిపోయి, డబ్బుకోసం విలువల్ని కూడా వదిలేసి వుండొచ్చును. కాని నేను చిన్నప్పటి నుంచీ కష్టాల్నే పడ్డాను. కష్టాలే పడుతున్నాను. కాని వాటిని ఎదుర్కోడంలో వున్న ఆనందం, విలువలను మరచి పోవడంలో నాకు ఎన్నడూ కన్పించలేదు. ఈ నాటికీ నాకింకా విలువలంటే గౌరవం పోలేదు. అది కాపాడు కోడానికే నేను యీ పుస్తకాన్ని రాయలేకపోతున్నాను. దయచేసి నన్ను క్షమించు విశ్వనాథం" అంటూ చకచకా బయటికి వచ్చేసేను- విశ్వనాథం చెప్పబోతూన్న దేదో కూడా విన్పించుకోకుండా!

బయట, స్వచ్ఛమైన గాలి ప్రాణాన్ని గాలిలో తేల్చి వేస్తోంది. ఆకాశం కడిగిన ముత్యంలాగ నిర్మలంగా వుంది.

## శేషేంద్రజాలం

బాబా సూర్యుడా
నిదురించే ఈ రాత్రి నెందుకు లేపుతావు
మా కష్టాలమీద మూత నెందుకు తీస్తావు
వాళ్ళకున్న ప్రభుత్వాలు సైన్యాలు
మాకు నాస్తి
రెండు శుభ్రమైన చేతులు
ఒక ఎర్ర రక్తం ప్రవహించే శరీరము
-ఈ రెండే మాకున్న ఆస్తి

*

వాళ్ళు భూమి మీద నడవడంలేదు
వాళ్ళు మన స్వప్నాలమీద నడుస్తున్నారు
వాళ్ళ కాళ్ళు కాలిపోతాయి
వాళ్ళు మన పిల్లల క్షుధాగ్నులమీద నడుస్తున్నారు
పురుగులై వాళ్ళు పునర్జన్మ ఎత్తుతారు
వాళ్ళు మన సమానత్వం గుర్తించలేదు

*

ఈ రాత్రి ఒడిలోనే
నీ పాక బాలుడివి
తెల్లవారితే నీ పాక సైనికుడివి!
నిశ్చింత ఒక చెరుకు
నములుతున్నంత వరకు
మనస్సు జులుం నెదిరించు
కన్నులతో ఒక కలని
కౌగలించు

*

నడుస్తోంది సేనావ్యూహం
శత్రు శతఘ్నులు ప్రేలుతున్నా
నడుస్తాడందులో సైనికుడు
ప్రక్కవాడు కూలుతున్నా
ఎందుకు చావాలని సైనికు
డొకడూ అడగని యుద్ధం
అర్థరహిత శబ్దాలతో అల్లిన
కవిత్వంకాని ఒక పద్యం

— శేషేంద్ర

